# సుకన్య

డా॥ కళ్యాణీ సచ్చిదానందం

''రాకుమారి! తెల్లని ఆ హంసల జంటని చూడండి, అలలమీద వయ్యారంగా వుయ్యాలలూగుతూ ఎంత ముచ్చటగా సాగిపోతున్నాయో!''

''ఆపవే నీ కవితా పాటవం మదనికా! రాకుమారీ! ఇటు చూడండి. నిండుగా పూసిన ఆ మాధవీలత మామిడి వృక్షాన్ని పెనవేసుకుని ఎంత సుందరంగా పైగి సాగుతున్నదో! ఎటు చూసినా కోయిలల కుహూరావాలు, నెమళ్ల నాట్యాలు. మీరీ వనానికి విహారానికి వస్తున్న వార్త తెలిసి వసంతుడు సపరివారంగా మీకు స్వాగతం పలుకుతున్నట్లనిపిస్తున్నది నాకు!'' అంటూ తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శించింది ప్రియంవద.

చెలుల మాటలకు కిలకిలమంటూ నవ్వింది సుకన్య. అందాల భరిణ, ఇక్ష్వాకు వంశస్థుడైన శర్యాతి మహారాజు గారాల పుత్రిక! ఆమె నవ్వుకు పరవశించినట్లు జలజలమని కురిసాయి పువ్వులను ఇరువైపులా వున్న పొగడచెట్లు! వాటి సౌరభానికి పరవశిస్తూ–

''నిజంగా ఈ వనవిహారం నాకెంతో ఆనందాన్ని కలిగిస్తున్నది. సుందరమైన ఈ ప్రశాంత పరిసరాలను విడిచి తిరిగి అంతఃపురానికి రావాలనిపించడం లేదు!'' అన్నది.

''మంచి కోరికే! అసలే తపోవనంలో మనవంటి నాగరికులు తిరుగాడటమే నిషిద్ధమట! సంధ్యాసమయం సమీపిస్తున్నది, ఇక వెళదాం పదండి రాకుమారి'' అంటూ తొందర చేశారు చెలులు!

''ఎందుకా తొందర? ఇప్పుడు మనం ఎవరి ఏకాగ్రతకు భంగం కలిగించలేదుగదా!'' అంటూ ముందుకు సాగిన సుకన్య ఆశ్చర్యంగా చూస్తూ ఆగిపోయింది, ఎదురుగా ఒక పుట్టమీద వెలుగులు చిమ్ముతున్న రెండు పుష్పాలను చూసి!

''ప్రియంవదా! చూడు, ఎలా అద్భుతంగా మెరుస్తున్నాయో ఆ పుష్పాలు! అవి తీసుకుని వెనుదిరుగుదాం'' అంటూ ప్రక్కగా పడివున్న ఒక పుల్లతో వాటిని పెకళించబోయింది. మెరవటం మాయమై ఆ పుష్పాల తావునుండి రక్తపుధారలు ప్రవహించసాగాయి.

భయంతో, ఆశ్చర్యంతో రెండడుగులు వెనక్కు వేశారు ముగ్గురు!

''వెళ్లిపోదాం పదండి రాకుమారి! పుట్టలో ఏ విషసర్పాలు దాగున్నాయో, అనవసరంగా వాటిని కదల్చబోయారు! పదండి వెళ్లిపోదాం!'' అన్నది ప్రియంవద.

కలవరపడ్డ మనస్సుతో చెలుల వెంట తండ్రి, పరివారం విడిది చేసిన స్థలం చేరుకుంది సుకన్య. వీళ్ళు వచ్చేసరికి అక్కడి పరిస్థితి మరింత ఆందోళన కలగజేసింది. అందరూ ఏదో చెప్పలేని విపరీతమైన బాధతో హాహాకారాలు చేస్తున్నారు!

''ఏమైంది నాన్నగారు?'' ఆదుర్దాగా అడుగుతూ తండ్రిని సమీపించింది!

''వచ్చావా నా చిన్నారి తల్లీ! గుండెల్లో ఏదో తెలియని బాధ. నేను పరివారం అందరూ కొద్దిసేపటి నుండి ఈ వింతరోగంతో అలమటించి పోతున్నాము, ఈ ప్రక్కన తపోవనంలో సిద్ధ రుషులుంటారని వినికిడి! మా వల్ల ఏదో అపచారం జరిగివుండాలి, అందుకే ఈ శిక్ష అనుభవిస్తున్నాం!'' అన్నాడు శర్యాతి మహారాజు నీరసంగా గుండెలపై రాసుకుంటూ.

''అలాగా! నేనిప్పుడు అక్కడనుండే వస్తున్నాను! నావల్ల ఏదైనా పొరబాటు జరిగి వుంటుందా?'' అంటూ వింతపుష్పాల గురించి చెప్పింది సుకన్య!

''అలాగా, మహామంత్రి! పదండి విషయమేమిటో తెలుసుకుందాం!'' అంటూ సుకన్య వెంట పుట్ట దగ్గరకు వచ్చాడు రాజు పరివారంతో!

పుట్టనుండి రక్తపు ధారలు స్రవిస్తూనే వున్నాయి. మహారాజు ఆజ్ఞతో భయపడుతూనే పుట్టను పెకళించారు భటులు. పుట్ట పెళ్ళున విరిగిపడి దానిలో అప్రతిమాన తేజంతో, కనుల నుండి స్రవిస్తున్న రక్తపు ధారలతో, పద్మాసనం వేసుకుని నిశ్చలంగా కూర్చుని వున్న వృద్ధ తపస్వి కానవచ్చాడు. ఆయన దేవీభక్తుడైన చ్యవనమహర్షి! పరమ శాంతమూర్తి! సుకన్య పుష్పాలని భ్రమించి ఆయన నేత్రాలను గాయపరిచిందని గ్రహించిన శర్యాతి, భయాందోళనలతో వణుకుతూ ఆయన పాదాలమీద వాలి దీనంగా మొరపెట్టుకున్నాడు.

''మహర్షి! మమ్మల్ని క్షమించండి. మీరిక్కడ తపోనిష్ఠలతో వున్న సంగతి తెలియక అజ్ఞానంతో నా కుమార్తె చేసిన అపరాధాన్ని మన్నించి, మమ్మల్ని బాధావిముక్తులను చేయండి!''

''రాజా! నీకు స్వస్తి కలుగుగాక! ఇంతకాలంగా ఏకాగ్రతతో నేను సాగిస్తున్న తపోచర్యకు ఈనాడు భంగం వాటిల్లింది. నేను శతవృద్ధుడను. పైగా ఇప్పుడు అంధత్వం కూడా ప్రాప్తించింది. ఇందుకు కారణమైన నీ కుమార్తెను నాకు ధారపోయి! మీ అందరి బాధ వుపశమిస్తుంది'' అన్నాడు చ్యవనమహర్షి గంభీరంగా!

ఆ మాటలకు విభ్రాంతుడై ఏ జవాబు చెప్పలేక మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయాడు శర్యాతి కొన్ని క్షణాలపాటు!

సుకన్య కూడా విన్నది మహర్షి వింత కోరికను! ఆయనవైపు నిశితంగా చూస్తున్న ఆమె హృదయంలో జాలి, అనురాగం చోటుచేసుకున్నాయి.

'తను చేసిన తప్పిదానికి ఆయన కోరిన కోరిక సమంజసమైనదే!' అనిపించింది.

అందుకే తండ్రిని సమీపించి ''నాన్నగారు! అంతటి మహర్షికి అర్ధాంగిని కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నిస్సంకోచంగా నన్ను వారికి ధారపోయండి'' అన్నది.

తమవైపు ఆవేదనగా చూస్తూ ''ప్రాణప్రదంగా పెంచుకున్న నిన్ను ఈ విధంగా కన్యాదానం చేయవలసి వస్తుందని వూహించలేకపోయాను. కుమారి! నీ ఇష్టప్రకారమే కానీ!'' అంటూ ఆమె చేతిని చ్యవన మహర్షి చేతిలో వుంచాడు శర్యాతి!

''మహర్షీ! మీరు కోరినట్లే నా కుమార్తె సుకన్యను మీకు అర్ధాంగలక్ష్మిగా సమర్పిస్తున్నాను. స్వీకరించండి!'' అన్నాడు గద్గద స్వరంతో!

మరుక్షణం అంతవరకూ అందరూ అనుభవిస్తుండిన బాధ మటుమాయమైంది. చ్యవన మహర్షి పెదవుల మీద సన్నని చిరునవ్వు తొణికిసలాడింది.

''మహారాజా! మీ ఔదార్యానికి కృతజ్ఞుడిని! ఇక మీరు నిశ్చింతగా మీ నగరానికి తిరిగి వెళ్ళండి. మమ్మల్ని ప్రశాంతంగా వుండనీయండి'' అన్నాడు.

''మహర్షి సెలవిచ్చింది విన్నారు గదా నాన్నగారు. ఇక మీరంతా వెళ్లండి. చెలులారా! ఇదిగో ఈ అమూల్యాభరణాలు మీకు కానుకగా ఇస్తున్నాను, తీసుకోండి'' అంటూ తను ధరించిన విలువైన ఆభరణాలు తీసి చెలులకు అందించింది సుకన్య!

''రాకుమారి! ఈ వన విహారానికి మనం రాకుండా వుంటే ఇంతటి ఆపద సంభవించి వుండేది కాదేమో. ఇంతకాలం కలిసిమెలిసి మీతో ఆటపాటలతో గడిపిన వాళ్ళం! మిమ్మల్నిప్పుడు ఇలా వంటరిగా విడిచి వెళ్లాలంటే మా గుండెల్లో అగ్నిపర్వతాలు బ్రద్దలౌతున్నాయి. 'ఈ వనసీమను విడిచి రావాలనిపించటం లేదు' అన్న మీ మాటలు ఈ విధంగా నిజమౌతాయని వూహించలేకపోయాం!'' అన్నారు ప్రియంవద, మదనిక సజల నయనాలతో ఆవేదనగా!

''మీరలా అనుకుని బాధపడకండి. జరిగిన దానికి

ఎంతమాత్రం విచారించడం లేదు నేను! వెళ్ళండి. సెలవు!'' అంటూ చిరునవ్వుతో సాగనంపింది సుకన్య తనవారిని.

'తన జీవితం అనుకోని మలుపు తిరిగింది. ఇంతవరకూ రాజభోగాలలో తేలియాడిన తను ఇపుడీ వనసీమలో ఒంటరిగా అంధుడైన ఈ వృద్ధ తపస్వికి ఏ కష్టమూ కలగకుండా మసలుకోవాలి!' అనుకుంది తదేకంగా మహర్షివైపు చూస్తూ!

• • •

''సుకన్యా! నామీద సానుభూతితో అష్టైశ్వర్యాలతో అంతఃపురంలో సుఖజీవనం గడపవలసిన నీవు ఇలా ఈ వనభూముల్లో నా పరిచర్యలో కాలం గడుపుతున్నావు. విధి ఎంత క్రూరంగా ప్రవర్తించిందోగదా నీపట్ల'' అన్నాడు చ్యవన మహర్షి తీయని ఫలాలు కొసరి కొసరి తినిపిస్తున్న భార్యపట్ల హృదయం ఆర్ద్రమౌతుంటే.

''అంత మాటనకండి స్వామీ! విధినలా నిందించకండి. మిమ్మల్ని సానుభూతితో సేవిస్తున్నానని ఎందుకు భావిస్తున్నారు? మీ పట్ల నాకున్నది సానుభూతి కాదు, అచంచలమైన ప్రేమా, అనురాగమూను!'' అంటూ మృదువుగా బదులు చెప్పింది సుకన్య.

''వృద్ధుడిని, అంధుడిని. నీ ప్రేమానురాగాలకు బదులివ్వలేని స్థితిలో వున్నవాడిని! విధి విధానం బలీయమైందని అందుకే అనుకుంటున్నాను'' మెల్లగా ఆయన అంటున్న మాటలు సుకన్యను కలవరపరిచాయి.

• • •

''ఆహా! ఈ ప్రదేశం ఇంత రమణీయంగా వుండటానికి కారణం ఇప్పుడు తెలుస్తున్నది. సోదరా! అటు చూడు. సందిట నీరు నింపిన పాత్రతో, తడబడుతున్న అడుగులతో నడచివస్తున్న ఆ స్త్రీమూర్తిని చూస్తుంటే విధాత సృష్టిలోని సౌందర్యాన్నంతా పొందికగా పొదిగి మలచినట్లుగా తోస్తున్నది. పద, వెళ్లి ఆమెను పలకరిద్దాం!''

భూలోకంలో వనవిహారం చేస్తున్న సూర్యపుత్రులు, దేవ వైద్యులు అయిన అశ్వినీ కుమారులు దారిలో తారసిల్లిన సుకన్య సౌందర్యానికి ముగ్ధులవుతూ ఆమెను సమీపించారు.

''సుందరీ! ఒక్క నిముషం ఆగి మా మాటలు ఆలకించు. నీవు దేవ, గంధర్వ, యక్ష కాంతలలో ఒకరివా లేక మానవ కాంతవేనా? నిత్యం నీ సౌందర్యాన్ని తనివితీరా తిలకిస్తున్న ఈ వన సీమ ఎంతటి భాగ్యశాలియో గదా! దేవ వైద్యులము, సూర్యపుత్రులము అశ్వినీ కుమారులము మేము. నీ అపూర్వ సౌందర్యానికి ముగ్ధులమై నీ పరిచయ భాగ్యాన్ని కోరుతున్నాము!'' అన్నారు.

వారి ప్రశంసాపూర్వకమైన పలుకులకు సిగ్గుతో కందిన ముఖాన్ని వంచి నమ్రతగా జవాబు చెప్పింది సుకన్య.

''దివ్య పురుషులారా! మీకు నా వినయపూర్వక ప్రణామాలు. పరకాంతను ఈ విధంగా ప్రశంసిస్తూ పలకరించడం ప్రాజ్ఞుల లక్షణం కాదు, మీరు భావించినట్లు నేను దివ్యాంగనను కాదు. ఇక్ష్వాక వంశ ప్రభువు శర్యాతి మహారాజు పుత్రికను, భృగుమహర్షి పౌత్రుడు చ్యవన మహర్షి పత్నిని. నా పతి శతవృద్ధులు, అంధులు! వారి నిత్యానుష్టానికై జలాలు తీసుకువెళుతున్నాను. ఈ వనసీమకు వచ్చిన మిమ్మల్ని అతిథులుగా భావించి మా ఆశ్రమానికి రమ్మని ఆహ్వానిస్తున్నాను. నా పతిని దర్శించి, దీవెనలు పొంది వెళ్ళండి!'' అన్నది.

''సుందరి! నీ మాటలు వింతగా వున్నాయి. క్షత్రియ కన్యవైన నీవు ఒక వృద్ధ తపస్వికి పత్నివా? విధి ఎంత క్రూరంగా ప్రవర్తించింది నీ పట్ల! నీ సౌందర్యం ఇలా అడవి కాచిన వెన్నెల కావలసిందేనా సుందరి? ఇప్పుడు అదృష్టం మా రూపంలో నిన్ను వెతుక్కుంటూ వచ్చిందని గ్రహించు! మా ఇద్దరిలో ఒకరిని వరించి మా లోకానికి వచ్చి దివ్యభోగాలు అనుభవించు'' అన్నారు వాంఛాపూరిత నేత్రాలతో ఆమెవైపు చూస్తూ.

వాళ్ల మాటలు విన్న సుకన్య కళ్లు కోపంత జేవురించాయి.

''పాపం శమించుగాక! దివ్య పురుషులారా, ఆపండి మీ అసందర్భ ప్రలాపాలు. తుచ్ఛమైన భోగాలకాశపడి పరుగులెత్తే పడతిలా కనిపిస్తున్నానా మీకు? మర్యాదగా అడ్డు తొలగండి, లేకపోతే ఇప్పుడే మిమ్మల్ని శాపదగ్ధులను చేయగలను!'' అన్నది తీవ్రంగా.

ఆమె మాటలకు విచలితులౌతూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు అశ్వినీ కుమారులు. కళ్లతోనే ఏదో సంభాషించుకుని, దారికి అడ్డు తొలగుతూ ''సుందరీ! శాంతించు. నీ మనస్సు తెలుసుకోడానికి అలా అన్నాము. నీవంటి స్థిరచిత్తకు వరం ప్రసాదించాలనిపిస్తున్నది. దేవవైద్యులమైన మేము నీ భర్తకు తిరిగి యవ్వనాన్ని, దృష్టిని ప్రసాదిస్తాము. వారిని ఈ సరోవర తీరానికి తీసుకురా! నీ రాకకోసం ఎదురుచూస్తూ ఇక్కడే నిలిచివుంటాము!'' అన్నారు.


వారికే సమాధానం ఇవ్వకుండా వడివడిగా సాగిపోయింది సుకన్య.

• • •

''మహర్షులకు అభివందనం'' సుకన్య చేయి పట్టుకుని నెమ్మదిగా నడచి వస్తున్న చ్యవన మహర్షికి ఎదురు వెళ్లి నమస్కరించారు అశ్వినీ కుమారులు.

''సూర్యపుత్రులారా, మీ గురించి నా పత్ని ద్వారా విన్నాను. మీకు నా ఆశీర్వచనాలు అందించి మా అతిథి సత్కారాలు స్వీకరించమని అడగడానికే స్వయంగా వచ్చాను'' అన్నాడు చ్యవనమహర్షి శాంత స్వరంతో.

''మీ ఆదరాభిమానాలకు కృతజ్ఞులం మహర్షీ! కఠినమైన తపస్సుతో జరాభారంతో కృశించింది మీ శరీరం. దృష్టికూడా కోల్పోయినట్లున్నారు. మీలో నవనవోజ్వలంగా యవ్వనం వెల్లివిరియడానికి ఇదుగో ఇక్కడి వన మూలికలతో ఈ ప్రత్యేకమైన ఔషధాన్ని మీకోసం సృష్టించాము. 'చ్యవనప్రాశ' మనే ప్రసిద్ధి చెందిన ఈ ఔషధం భూలోక వాసులకు ఆయురారోగ్యాలు ప్రసాదించేలా అనుగ్రహిస్తున్నాము. సేవించి, తటాకంలో దిగి స్నాన





## పడతాయి!

''ఏమండీ, నేను ఎన్నిరాసి పంపించినా పత్రికలలో రావడంలేదండి. ఇంతకు అవి చేరుతున్నాయో లేదో'' అనుమానంగా అడిగింది భార్య.

''ఎందుకు చేరవు చేరుతూనే ఉంటాయి. పడుతూనే ఉంటాయి'' చెప్పాడు భర్త.

''ఎందులో పడతాయంటారు?'' ఆదుర్దాగా అడిగింది భార్య.

''ఇంకెందులో చెత్తబుట్టలో'' తాపీగా చెప్పాడు భర్త.

- ఎస్.కె.దుర్గ (అమరచింత)

## ఉదాహరణ

''ఒక వంతెన కట్టటానికి 15 మందికి పది రోజులు పడుతుంది. 75 మందికి అదే వంతెన కట్టటానికి రెండు రోజులు చాలు. ఇలాంటిదే మరో ఉదాహరణ చెప్పు'' అన్నారు టీచర్.

ఓ విద్యార్థి లేచి చెప్పాడు- ''ఒక కారులో ఢిల్లీ వెళ్ళటానికి మూడు రోజులు పడుతుంది. మూడు కార్లలో వెళితే ఒక్క రోజే పడుతుంది.'' అన్నాడు.

## పొగిడింది


''ఏమండీ ఎదురింటి కామాక్షి నన్ను ఎంతో పొగిడింది. నేనంత అందంగా వున్నానా?'' భర్తను అడిగింది మీనాక్షి.

''ఆవిడ కూతురు పదో తరగతి పాసయింది. అందుకే నిన్ను పొగిడింది'' అన్నాడు భర్త.

''దానికీ, నా అందానికీ సంబంధం ఏమిటి?''

''ఆవిడ కూతురుకి కాలేజీలో సీటు నేనే ఇప్పించాలి. అందుకని నిన్ను వలలో వేసుకొంది.''

- పి.స్వరాజ్యలక్ష్మి (హంపసాగర)




మాచరించండి!'' అంటూ ఔషధాన్ని చ్యవనునికి అందించారు అశ్వినీకుమారులు.

దానిని కన్నులకద్దుకుని త్రాగి వాళ్లు చెప్పినట్లుగా తటాకజలాలలో మునిగి లేచాడు చ్యవనమహర్షి! అదే సమయంలో తాముగూడ తటాకంలో మునిగి లేచారు అశ్వినీ కుమారులు.

కొద్ది దూరంలో నిలబడి చూస్తున్న సుకన్య విభ్రాంతురాలైంది ఒకే రూప లావణ్యాలతో వెలుగొందుతున్న ముగ్గురిని చూసి!

''సుందరీ! భీతి చెందకు. ఒకే రూపంలో కనిపిస్తున్న మా ముగ్గురిలో నీ పతిని నీవే గుర్తించు మరి'' అన్నారు ఏక కంఠంతో చిరునవ్వులు చిందిస్తూ!

'అశ్వినీకుమారులు మహర్షిని కూడా తమతో సమానమైన రూపంతో అగుపడేలా చేసి నాకు విషమ పరీక్ష పెట్టారు! సర్వమంగళాదేవి! నా ప్రాతివత్యాన్ని నిరూపించు'' అంటూ దేవీమాతను ప్రార్థించి వాళ్ళవైపు పరిశీలనగా చూసిన సుకన్య కళ్లకు చ్యవనుని ముఖం కనిపించింది మధ్య నిలబడివున్న పురుషునిలో! వెంటనే నిస్సంకోచంగా వెళ్లి ఆయన పాదాలకు నమస్కరించింది. వెలవెలబోతున్న ముఖాలతో తమ నిజరూపాలు ధరించారు అశ్వినీకుమారులు.

''మహాసాధ్వీ సుకన్యా! నీ సౌశీల్యంతో మా కన్నులు తెరిపించావు. నీకివే మా శతకోటి ప్రణామాలు. పూర్ణారోగ్యవంతుడైన నీ భర్తతో సుఖంగా జీవించు. మహర్షీ! ఇక మాకు సెలవిప్పించండి'' అంటూ ఆ దంపతులకు వినమ్రంగా నమస్కరించారు.

''దేవ వైద్యులారా! మీరు నాకు చేసిన వుపకారానికి ప్రతిఫలం సమర్పించుకోవాలని ఆశిస్తున్నాను. మీకు తీరని కోరిక ఏదైనా వుంటే నిస్సంకోచంగా అడగండి! మీ వాంఛితం నెరవేరుస్తాను!'' వాళ్లవైపు ప్రసన్నంగా చూస్తూ అన్నాడు చ్యవన మహర్షి!

''ఎంతమాట. మేమే ప్రతిఫలమూ ఆశించి ఈ ఉపకారం చేయలేదు. మమ్మల్ని వెళ్లనివ్వండి మహర్షి.''

''దివ్యపురుషులారా! అలా అని మమ్మల్ని మరింత రుణగ్రస్తులను చేయకండి. నా పతి తపోబల సంపన్నులు. మీరెంతటి అసాధ్యమైన కోరిక కోరినా తప్పక నెరవేరుస్తారు. సంకోచం మాని అడగండి'' సుకన్య కూడా చెప్పడంతో సంకోచాన్ని ప్రక్కకునెట్టి మనస్సులోని చిరకాల వాంఛను బయటపెట్టారు అశ్వనీ దేవతలు.

''మహర్షి! సోమపానం చేయాలన్న బలీయమైన వాంఛ మా ఇద్దరిలో ఎంతో కాలంగా వున్నది. అందుకు దేవరాజైన ఇంద్రుడు అనుమతి నీయకుండా అడ్డు తగులుతున్నాడు. మేము దేవ వైద్యులు కనుక మాకు సోమపానార్హత లేదుట. మీరు ఇంద్రుని ఎదిరించి మాకు సోమపానార్హత కల్పించగలరా?''

''తప్పకుండా కలిగిస్తాను. మీ చిరకాల వాంఛ నెరవేరేటట్లు చేస్తాను త్వరలోనే. మీరు నిశ్చింతగా ఉండండి'' అంటూ వాగ్దానం చేసాడు చ్యవన మహర్షి గంభీరంగా.

ఆయనకు నమస్కరించి సంతోషంగా తమ లోకానికి వెళ్లిపోయారు అశ్వనీ కుమారులు.

• • •

'ఏమిటీ విచిత్రం! తన కన్నులు తనను మోసం చేయడంలేదుకదా. కుమారినెంత దీనస్థితిలో చూడవలసి వస్తుందోనని వ్యథ చెందుతూ వచ్చాడు తను. కానీ ఆమె ఎంతో ఆనందంగా ఎవరో నవయువకుడితో సంభాషిస్తున్నదే. అంత సన్నిహితంగా ఎలా మసలుతున్నది? వృద్ధ తపస్వి ఏమైనట్టు?'

చెట్టు చాటున నిలబడి సుకన్యనే గమనిస్తూ పరిపరి విధాలుగా ఆలోచిస్తున్నాడు శర్యాతి మహారాజు.

కుమార్తె మీది బెంగతో ఆమెను చూడాలన్న ఆత్రుత కొద్దీ వంటరిగా ఆ వనసీమలోకి వచ్చి చ్యవన మహర్షి ఆగ్రహానికి గురి కావడం ఇష్టంలేక చాటుగా నిలబడి చూస్తున్నాడు సుకన్య అటువైపు వస్తుందన్న ఆశతో.

ఆయన నిరీక్షణ ఫలించినట్టు కొంతసేపటికి బిందెతో కొలనువైపు వెళ్ళబోతున్న సుకన్య ఆయనను గమనించి ఆనందంతో విప్పారిన ముఖంతో ''నాన్నగారూ! మీరెప్పుడు వచ్చారు? అలా అక్కడే నిలబడ్డారెందుకు? రండి! ఇప్పుడు మీరు చింతించాల్సిన పనిలేదు. మీ అల్లుడుగారిని చూద్దురుగాని రండి'' అంటూ దగ్గరకు వెళ్లింది.

ఆ మాటలు విపరీతంగా తోచాయి శర్యాతికి. ఆయన ముఖం కోపంతో జేవురించింది.

''కుమారీ! ఎందుకింతటి అకృత్యానికి వడిగట్టావు? మన వంశ ప్రతిష్ఠకు కళంకం తెచ్చేలా వృద్ధ తపసిని విడిచి మరో నవ యువకుడిని చేపట్టావా? ఈ ఘోరం చూడడానికేనా నేనింత తపన పడుతూ వచ్చింది?'' అన్నాడు ఆవేశంగా.

ఆ మాటలకు నొచ్చుకుంటూ ''మీరు పొరబడుతున్నారు నాన్నగారూ! మీ కుమార్తె ఎన్నడూ ధర్మపథం వీడదని విశ్వసించండి. అసలు జరిగినదేమిటంటే...'' అంటూ అన్ని విషయాలు వివరంగా తెలియజెప్పింది సుకన్య.

''ఏమిటి? ఆ వృద్ధ తపసే ఈ నవయువకుడా? కుమారి! ఇప్పటికి నా హృదయభారం తీరిపోయింది. నీవు ధన్యురాలివి తల్లీ'' అంటూ ఆమెను ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నాడు శర్యాతి.

''రండి నాన్నగారూ! మహర్షి పుంగవులను దర్శించి వెళుదురుగానీ'' అంటూ కుటీరం లోపలకు తీసుకువెళ్లింది.

గ్రంథ పఠనంలో నిమగ్నుడై వున్న చ్యవన మహర్షి ఆయనను ఆదరంగా ఆహ్వానించాడు.

''ఆసీనులు కండి మహారాజా! మీ కుమార్తె ద్వారా అన్ని విషయాలు తెలుసుకున్నారుకదా! ఇప్పుడొక

బృహత్కార్యం మీద్వారా జరగాల్సి ఉన్నది'' అన్నాడు గంభీరంగా.

''ఏమిటది మహర్షి! సెలవివ్వండి'' అడిగాడు శర్యాతి ఆత్రుతగా.

''మీచేత ఒక మహా యజ్ఞం చేయించాలని సంకల్పించాను. మీరు అందుకు కావాల్సిన ఏర్పాట్లన్నీ సత్వరం జరిగేలా చూడండి. ఆ యజ్ఞఫలంగా మీ దేశం సుభిక్షమవుతుంది. నా ఆశయం కూడా నెరవేరుతుంది'' అన్నాడు చ్యవన మహర్షి.

''అలాగే! మీ ఆజ్ఞను శిరసావహిస్తాను'' అన్నాడు శర్యాతి వినయంగా.

● ● ●

యజ్ఞ భూమి రుషి, ముని పుంగవులతో, ఆహ్వానితులతో కళకళలాడుతున్నది. చ్యవన మహర్షి ఆధ్వర్యంలో శర్యాతి మహారాజు చేస్తున్న ఆ మహా యజ్ఞానికి ఇంద్రాది దేవతలందరూ ఆహ్వానాలందుకుని వేంచేసారు. ఉన్నతాసనాన్నలంకరించి ప్రసన్నంగా కార్యక్రమాన్ని చూస్తున్న మహేంద్రుని కనుబొమ్మలు ప్రశ్నార్థకంగా ముడివడ్డాయి లోనికి వస్తున్న అశ్వనీ కుమారులను చూసి.

''వరుణదేవా! అశ్వనీ కుమారులు యజ్ఞభూమికి రావడానికి అనర్హులని శర్యాతికి తెలియదా? వారినెందుకు ఆహ్వానించినట్టు?'' అన్నాడు అసహనంగా.

''అదే నాకూ అర్థం కావడంలేదు మహేంద్రా! శర్యాతినే అడుగుతాను'' అంటూ సందేహ నివృత్తికోసం శర్యాతి దగ్గరకు వెళ్లాడు వరుణుడు.

చ్యవన మహర్షి చెంత కూర్చుని యజ్ఞం కొనసాగిస్తున్న శర్యాతి తాను వారికి ఆహ్వానం పంపలేదని తెలియజేసాడు. వారి మాటలు విన్న చ్యవన మహర్షి కలుగ చేసుకుంటూ ''వారు నా ఆహ్వానం అందుకు వచ్చారని తెలియజేయండి మహేంద్రునికి'' అన్నాడు గంభీరంగా.

''ఎంతటి సాహసం? ఇంద్రుని శాసనాన్ని ధిక్కరించడమా? యవ్వనం ప్రాప్తించడంతో చ్యవన మహర్షి బుద్ధి మందగించినట్లుంది. చూస్తాను. ఏం చేస్తాడో?'' అంటూ రుసరుసలాడాడు ఇంద్రుడు. యజ్ఞం సమాప్తి కానున్నది. మహేంద్రునికి, ఇతర దేవతలకు సోమరసాన్ని అందజేస్తున్నారు హవిర్భాగాలతోబాటు.

''అశ్వనీ దేవతలారా! రండి! సోమపానం చేయండి'' అంటూ వారికి పాత్రనందించబోతున్న చ్యవనుని వారిస్తూ–

''మహర్షి! అశ్వనీ కుమారులకు సోమపానం నిషిద్ధమని ఎరుగరా? మీ ప్రవర్తన ఆశ్చర్యకరంగా ఉందే!'' అన్నాడు ఇంద్రుడు అసహనంగా.

''దేవేంద్రా! మీరు నిషేధించినా ఈ యజ్ఞవేదికపై వారికి సోమపానార్హత నేను కల్పించదలిచాను. మీరు అడ్డు రావద్దని మనవి చేస్తున్నాను'' అన్నాడు చ్యవనుడు శాంత గంభీర స్వరంతో.

''ఓహో! ఈ మహేంద్రున్నే ధిక్కరించే సాహసమా! మహర్షి చూడు నిన్నేం చేస్తానో'' విసురుగా వజ్రాయుధ్ధాన్ని తీసి ఆయనపై ప్రయోగించబోయిన ఇంద్రుడు ''మహేంద్రా! ఆగక్కడే!'' అన్న చ్యవనుని గర్జనతో అచేతనంగా నిలబడిపోయాడు.

తన తపోబలంతో అప్పటికప్పుడే మదుడనే మహాకాయుడిని సృష్టించాడు చ్యవన మహర్షి. మహేంద్రుడిని కబళించడానికి ఆయనవైపు శరవేగంతో వెళ్లసాగాడు మదుడు. అందరూ భయభ్రాంతులై చూస్తుండగా దేవగురువు బృహస్పతి మధ్యలో నిలిచి చ్యవన మహర్షిని శాంతపరచడానికి ప్రయత్నించాడు.

''మహేంద్రుని అవినయాన్ని మన్నించండి మహర్షి! ఆ మదుడిని ఉపసంహరించి అనర్థం వాటిల్లకుండా ఆపండి. దేవీ ఉపాసకులు, భృగు మహర్షి పౌత్రులు అయిన మీరు కోపం వహిస్తే మహేంద్రుడు నిలవగలడా? శాంతించండి'' అంటూ ప్రాధేయపడ్డాడు.

చ్యవన మహర్షి తపోబలం ముందు నిలవలేడని తెలుసుకున్న మహేంద్రుడు తన పట్టు విడవక తప్పలేదు. అశ్వనీ కుమారులు ఆనందంగా సోమపానం చేసి తమ కోర్కె తీరినందుకు చ్యవన మహర్షికి కృతజ్ఞతలు తెలియజేసారు.

''మహర్షి! నాకేమి ఆజ్ఞ!'' ప్రశ్నిస్తున్న మదునివైపు ప్రసన్నంగా చూస్తూ ''నిన్ను సృష్టించినందుకు వ్యర్థంగా వదిలిపెట్టలేను. అందుకే నీకు స్త్రీలలో, మదిరాపానంలో, వేటలో, జూదంలో స్థానం కల్పిస్తున్నాను. వెళ్లి నీ స్థానాలను ఆశ్రయించు'' అన్నాడు చ్యవన మహర్షి.

''బాగు బాగు మహర్షి. మీ కృపతో స్త్రీలను మదవతులుగా చేసారు. వారి ఆకర్షణ నుండి పురుషులు తప్పించుకోవడం దుర్లభం ఇకపై'' అన్నాడు బృహస్పతి మందహాసం చేస్తూ.


''ఇదంతా దేవీ లీలా విలాసం. ఆమె సంకల్పబలం చేతే ఈ మదుడు సృష్టింపబడ్డాడు. అతని అంశ స్త్రీలలో ఆకర్షణ శక్తినేగాక వారి శక్తి సామర్థ్యాలను కూడా వృద్ధి చేస్తుంది. జూదం, మదిర, సన్మార్గరతులను చలింపజేయలేవు. కానీ అధర్మ ప్రవర్తకులు మదుని ప్రభావంతో వాటికి లోనై తమ వినాశనాన్ని తామే కొని తెచ్చుకుంటారు'' అంటూ వివరించాడు చ్యవన మహర్షి.

''ఇంద్రుని గర్వభంగంతోపాటు దేవీభక్తుడైన చ్యవన మహర్షి తపోబలం మహిమ అందరికీ తెలియవచ్చింది. ఈ మహా యజ్ఞాన్ని తిలకించి ధన్యులమయ్యాం అందరం. సర్వేజనా సుఖినోభవంతు'' అన్నాడు బృహస్పతి.

అశ్వనీ కుమారులను, ఇతర ఆహ్వానితులను వీడ్కొలిపి శర్యాతికి శుభాశీసులు అందజేసి భార్యా సమేతంగా తపోవనానికి తరలిపోయాడు చ్యవన మహర్షి!

★

## మరుగుజ్జుల రికార్డు



మరుగుజ్జులకి ఎన్నో రికార్డులున్నాయి. బ్రతికున్నవాళ్ళలో (1985 నాటికి) ఆంటోనియో ఫెరేరా పోర్చుగల్‌లో వున్నాడు. అతని ఎత్తు కేవలం ఇరవైతొమ్మిదిన్నర అంగుళాలు. రెండున్నర అడుగులు అనొచ్చు. మరణించిన వాళ్ళలో 18 అంగుళాల ఎత్తున్న జఫరీ హడ్సన్‌ని చెప్పుకోవాలి. అతను క్రీ.శ. 1619 నుంచి 1692 దాకా జీవించాడు. అతను బ్రిటీష్ అశ్వసైన్యంలో కెప్టెన్‌గా పనిచెయ్యడం మరో వింతైన విషయం.

## జంతువుల మచ్చిక

మనిషి జంతువులను మచ్చిక చేసుకుని వాటికి ఎన్నో నేర్పి సర్కస్ ఫీట్లు చేయించాడు. కాని తలమీద నిలబడగలగడం ఏనుగుకు మాత్రమే సాధ్యమైంది. మిగతా ఏ జంతువుకీ ఆ విద్య నేర్పలేకపోయాడు.

## నవ్వేజబ్బు

ప్రపంచంలో ఓ విచిత్రమైన వ్యాధి వుంది. దాని పేరు 'కురు'. దాన్నే నవ్వే జబ్బు అంటారు. ఇది ఎక్కువగా న్యూగినియాలోని సజాతి భణు (మనిషిని మనిషి తినే కేనీబాల్ తెగ)ల్లో కనిపిస్తుంది. ఇది మానవుల మెదడు తినడం వల్ల వస్తుంది. అందుకే ఎక్కువ నవ్వడం అంతమంచిది కాదేమో. తెలిసిన వాళ్ళు 'కురు' జబ్బుందనుకుంటారు. నవ్వుకి ఇదో చేటు దాపురిస్తుంది తస్మాత్ జాగ్రత్త.

## బిజీబిజీ ఎయిర్‌పోర్ట్

ప్రపంచంలోని అతి రద్దీగల విమానాశ్రయం జాన్.ఎఫ్.కెన్నడీ విమానాశ్రయం అనుకుంటారు సామాన్యంగా. కాని నిజానికి చికాగో అంతర్జాతీయ విమానాశ్రయానికి రద్దీ ఎక్కువ. ఆ విమానాశ్రయంలో 42.5 సెకండ్లకొకటి చొప్పున గంటకి 85, రోజుకి 2036, వారానికి 14255, ఏడాదికి 7,41,272 విమానాలు ఎగురుతూ వుంటాయి.

– రాపేటి

